క్లుప్తంగా

4న పడిపూజ మహోత్సవం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ : స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 4వ తేదీన పడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయంలో పడిపూజ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించే పడి పూజ శబరిమల మాలికపురం మేల్‌శాంతి పి.ఎం.మనోజ్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. అయ్యప్పమలాధారులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో జర్మనీరాజు, భగవాన్, హేమంత్, శివమూర్తి, పోస్టల్ రమణ, బాలకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఉపాధ్యాయుడు మృతి



సిద్ధరామమూర్తి(ఫైల్)

మదనపల్లె : మండలంలోని వేంపల్లె ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న జి.సిద్ధరామమూర్తి శనివారం రాత్రి మృతి చెందాడు. సిద్ధరామమూర్తికి రెండు కిడ్నీలు చెడిపోవడంతో చాలా కాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంత్యక్రియలు ఆదివారం ఆయన స్వస్థలం అంకిశెట్టిపల్లె గాంధీపురం శ్మశానవాటికలో జరిగాయి. సిద్ధరామమూర్తి మృతికి మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యాశాఖ సిబ్బంది పలువురు సంతాపం తెలిపారు.

పింఛా నదికి జలహారతి



పింఛా నదికి జలహారతి ఇస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గార్గేయ ప్రాజెక్టు నిండి పరవళ్లు తొక్కుతుంది. ఆదివారం సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వార్డు మెంబర్లు, పంచాయతీ సిబ్బంది గార్గేయ ప్రాజెక్టు వద్ద చేరుకుని పింఛా నదిలో పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పీలేరు ప్రాంతంలో తాగునీటి సమస్య తీరుతుందని, బోర్లులో నీటి మట్టం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు విక్టరీ వెంకటరమణారెడ్డి, పరమేష్, అబీద్, రమణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బి.డి. మహేష్‌రెడ్డి, ఓబులేషు, వెంకటరమణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబులమ్మ సన్నిధిలో వనభోజనాలు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం గ్రామ శివారులో వెలసిన ఓబులమ్మ అమ్మవారికి సిద్దవటం గ్రామ ప్రజలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక మాస వారోత్సవాల సందర్భంగా వనభోజనాలను ఏర్పాటు చేశారు. అమమ్వారికి అభిషేకం అలంకరణ, కుంకుమార్చిన అర్చనలు తీర్థప్రసాదాల వినియోగం వంటి పూజా కార్యక్రమాలను జరిపించారు.

ప్రవచనాలతో ప్రయోజనం

నందలూరు : గీత ప్రవచనామృతములను వినడం ద్వారా ప్రయోజనం ఉంటుందని విశ్రాంత తహసీల్దార్ నాయనపల్లి జయన్న, గెలివి రత్నం శెట్టిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కృష్ణ గీతా మందిరంలో ఈనెల 4వ తేదీ నుండి 10వ తేదీ వరకు కడప పట్టణానికి చెందిన అచ్చోలి ముకుంద రెడ్డి ప్రవచనాలు బోధించడం జరుగుతుందన్నారు. 11వ తేదీ గీతా జయంతి కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భగవద్గీత గ్రంథాలను ఉచితంగా అందజేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మానవత్వం చాటుకుంటున్న ఎమ్మెల్యే

రాజంపేట టౌన్ : జంతువుల పట్ల అనేక మందికి ప్రేమ ఉంటుంది. అయితే వాటిని దగ్గర ఉంచుకొని ఆకలి తీర్చడం, చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా తల్లడిల్లిపోయి వైద్యం చేయించడం వంటివి అతికొద్ది మంది మాత్రమే చేస్తారు. అలాంటి వారిలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముందువరసలో ఉంటారు. ఆయన తన ఎస్టేట్‌లో అనేక మూగజీవులను పోషిస్తున్నారు. ఉదయం నిద్రలేవగానే మూగజీవులకు సేవచేయడంతోనే ఆయన తన దినచర్య ప్రారంభిస్తారు. ఆదివారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో పెంచలకోనలోని నృసింహ స్వామి దర్శనానికి వెళుతూ రాపూరు ఘాట్‌లో పెద్దసంఖ్యలో ఉండే వానరాల కోసం నాలుగు గోతాల మేర పండ్లు తీసుకెళ్లి వాటికి స్వయంగా అందించారు.

వణికిస్తున్న ఫెంగల్



తుపాను దెబ్బకు సీటీఎం రోడ్డుపై కనిపించని జనసంచారం



మాలేపాడు గ్రామంలో నేలకొరిగిన వరిపైరు

- జడివానతో ఇళ్ల నుంచి బయటకు రాని జనం
- పొలాల్లో నేలవాలిన వరిపైరు
- కలికిరిలో అత్యధికంగా 81.2 మి.మీల వర్షపాతం

మదనపల్లె : బంగాళాఖాతంలో ఫెంగల్ తుపాను ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వర్షపుజల్లులు కురుస్తున్నాయి. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షపు జల్లులు, ఆదివారం మొత్తం కొనసాగాయి. ఆకాశం మేఘావృతమై, చల్లనిగాలులు వీస్తుండటంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపలేదు. దీనికితోడు ఆదివారం కావడంతో పట్టణంలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. వానకు వ్యాపారాలు జరవని, చాలా చోట్ల దుకాణాలు మూతపడ్డాయి. మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో అక్కడక్కడా కోతకు వచ్చిన వరిపంట నేలవాలింది. వర్షాలతో పంటలు ఎక్కడ దెబ్బతింటాయోనని రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. పట్టణశివారు ప్రాంతాల్లో పలురోడ్లు బురదమయం కావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. చలి విపరీతంగా ఉండటంతో అత్యవసర పనులపై తప్ప ప్రజలు బయటకు రాలేదు. ఇళ్లలో తలుపులు వేసుకున్నప్పటికీ చిన్నపిల్లలు, వృద్ధులు చలికి గజగజ వణికిపోయారు.

మదనపల్లె డివిజన్‌లో..

మదనపల్లె డివిజన్‌లోని 11 మండలాల్లో ఆదివారం ఉదయం వరకు 308 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కలికిరి మండలంలో 81.2 మి.మీ.ల వర్షపాతం కురిసింది. మదనపల్లె 21, కురబలకోట 32.2, నిమ్మనపల్లె 33.6, బి.కొత్తకోట 15.4, పీటీఎం 11.8, ములకలచెరువు 12.6, పెద్దమండ్యం 28.6, తంబళ్లపల్లె 21.4, వాల్మీకిపురం 32.6, రామసముద్రం 17.6 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఫెయింజల్ తుపాను దెబ్బకు మదనపల్లె టమాటా మార్కెట్‌కు 90 మెట్రిక్‌టన్నుల టమాటా మాత్రమే వచ్చింది. అందులో మొదటిరకం టమాటా కిలో రూ.42–48 మధ్య ధర పలకగా, రెండోరకం రూ.34–41 మధ్య అమ్ముడైంది. వారంరోజుల సరాసరి దిగుబడులను పోలిస్తే, ఆదివారం మార్కెట్‌కు టమాటా దిగుబడులు తగ్గుముఖం పట్టాయి. రెండురోజులుగా ముసురు వర్షాలు కురుస్తుండటంతో పంటనష్టాలను అంచనా వేయలేకపోయామని, సోమవారం మదనపల్లె డివిజన్‌లో పంటనష్టాలపై వివరాలు సేకరిస్తామని ఏడీఏ శివశంకర్ తెలిపారు.

ఫెంగల్ తుపానుతో అవస్థలు

రామసముద్రం : ఫెంగల్ తుపాను కారణంగా ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈదురుగాలులతో కూడిన వర్షానికి, చలికి, ప్రజలు, మూగజీవాలు వణికిపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మేతలు లేక మూగజీవాలైన పాడిఆవులు, గొర్రెలు, మేకల ఆర్తనాదాలు ప్రజలను కలిచివేశాయి. గ్రామాలు వర్షం కారణంగా రొచ్చురొచ్చుగా మారాయి. వాహనచోదకులు చలికి, వర్షానికి ప్రయాణించలేక ఇబ్బందులు పడ్డారు. అలాగే ఈదురుగాలులతో కూడిన తుపాను వర్షం కారణంగా చేతికొచ్చిన వరిపంట నేలకొరిగింది. కోతకు వచ్చిన పంటను ఒబ్బిడి చేసుకునే సమయానికి తుపాను రావడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టమాటా, కొత్తిమీర, క్యాలీఫ్లవర్, మొక్కజొన్న తదితర పంటలు వర్షానికి దెబ్బతిన్నాయి. తుపాను కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు.



తుపానుకు మేత లేక అలమటిస్తున్న పాడి ఆవులు, గొర్రెలు

ఆలయాల బాధ్యత హిందువులకు అప్పగించాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్‌నాయుడు

మదనపల్లె సిటీ : హిందు దేవాలయాలు ప్రభుత్వ అదీనంలో కాకుండా హిందువులకు అప్పగించాలని ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు అన్నారు. ఆదివారం మదనపల్లె మండలం చిప్పిలి సత్యనారాయణస్వామి ఆలయంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. వచ్చే నెల జనవరి 5వతేదీ విజయవాడలో జరిగే హైందవ శంఖారావంకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. హిందువులను చైతన్యం చేయడం కోసమే సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా కార్యదర్శి సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్న చూపా..కక్ష సాధింపా..?

- సచివాలయ ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- వలంటీర్లు చేసిన విధులన్నీ చేయిస్తూ రోడ్ల వెంట తిప్పుతున్న వైనం
- తీవ్ర ఒత్తిడి, అవమానాలకు గురతున్నామని ఉద్యోగుల అంతర్మథనం

పెద్దతిప్పసముద్రం : సచివాలయ ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తూ కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఉద్యోగులు అంతరంగికంగా మదనపడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు చేసిన విధులన్నింటినీ ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులతో చేయిస్తూ నిత్యం వారిని రోడ్ల వెంట తిప్పుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వలంటీర్లను తొలగించం, జీతాలు కూడా పెంచుతామని ఎన్నికల సమయంలో చెప్పిన ఇప్పటి పాలకులు అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా వారిని నిలువునా ముంచేసారని విమర్శలు గుప్పుమంటున్నాయి. సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి, అవమానాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సచివాలయ ఉద్యోగులచే పింఛన్లు పంపిణీ చేయించారు. ఆ తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై రోజు మార్చి రోజు పరిశీలన చేసి యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని అప్పగించారు. అనంతరం వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ చేయించారు. తాజాగా మళ్ళీ ఇంటింటికీ తిప్పి జియో ట్యాగింగ్ చేయిస్తున్నారు. జియో ట్యాగింగ్ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను పట్టించుకోకుండా చేయాల్సిందేనని ప్రభుత్వం వేధిస్తుండటంతో సచివాలయ ఉద్యోగులు నలిగి పోతున్నారు. టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిళ్లతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మరో వైపు ఇటీవల జరిగిన అధికారుల బదిలీల్లో చాలా మంది వేరే ప్రాంతాలకు వెళ్లడంతో సిబ్బంది కొరత అధికమైంది. తద్వారా ఉన్న అరకొర సిబ్బంది పైనే అదనపు పని భారం పడుతోందని వాపోతున్నారు. ఉన్నత చదువులు చదివి పరీక్షల్లో ప్రతిభ చాటిన తమతో ఇలాంటి పనులు చేయిస్తున్నారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేవలం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము ఉద్యోగాలు పొందడమే చేసిన పాపమా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జియో ట్యాగింగ్‌లో ఇబ్బందులెన్నో

ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి జియో ట్యాగింగ్ సర్వే నిర్వహిస్తున్నారు. ఎంప్లాయిస్ మొబైల్ అప్లికేషన్ పేరిట వచ్చిన యాప్‌లో ప్రతి ఇంటినీ ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేసి ఆధార్ నంబర్ అప్‌లోడ్ చేయాలి. ఆయా సచివాలయాల పరిధిలోని గృహాల సంఖ్యకు అనుగుణంగా టార్గెట్లు ఇచ్చారు. సర్వే సమయంలో గృహ యజమాని తప్పని సరిగా బయోమెట్రిక్ లేదా ఫేసియల్ అథెంటికేషన్ ఇవ్వాలి. ఈ సర్వేపై పలు చోట్ల ప్రజలకు అనుమానాలు వ్యక్తమవుతుండటంతో ప్రజలు కొంత మంది సర్వేకు సహకరించడం లేదు. దీనికి తోడు పలు చోట్ల నెట్‌వర్క్ పని చేయక, సిగ్నల్స్ రాక యాప్ ఓపన్ కానందున ఉద్యోగులు పడే ఇబ్బందులు వర్ణణాతీతం. ఒక వైపు టార్గెట్ల పేరుతో వస్తున్న తీవ్ర ఒత్తిళ్ళ కారణంగా పలువురు సచివాలయ ఉద్యోగులు శెలవు పెట్టి గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు



లక్కిరెడ్డిపల్లి: శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అనంతపురం గంగమ్మ



సంబేపల్లె: అలంకరణలో దేవరరాయి నల్లగంగమ్మ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో ..

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో శుద్ధి చేసి, అమ్మవారికి పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి ప్రత్యేకంగా అలంకరించారు.

మల్లూరమ్మ ఆలయంలో..

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో కొలువైన శ్రీ మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మ దేవత అమ్మవారు ఆదివారం రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తిక మాసం ముగియడంతో అమావాస్య కావడంతో గంగమ్మ దేవత అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించి పూజలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులతో పాటు మిగతా వాహనాలకు అమావాస్య రోజున పూజలు నిర్వహించారు. మండలంలోని మద్దిరాల గ్రామం వంకగడ్డ రాజుపల్లి సమీపంలో వెలసిన మారెమ్మ దేవత అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు.

15న థిల్లానా ది మెగా ఫెస్ట్ టాలెంట్

మదనపల్లె సిటీ : కళలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 15న మదనపల్లెలో థిల్లానా ది మెగా ఫెస్ట్ టాలెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక బీటీ కాలేజీలో ఈనెల 15వతేదీన ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఇందులో డ్యాన్స్, సింగింగ్, పెయింటింగ్, మెహందీ, రంగోలి,ఫోటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలిచినవారికి బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9676499064ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో సభ్యులు దిలీప్, దివ్యరాజు, శ్రీనాథ్, అల్తాఫ్‌ఖాన్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు గాలికి.. ప్రజల జేబులు గుల్ల

- కూటమి ప్రభుత్వంలో బాదుడే బాదుడు
- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం) : అధికారం చేపట్టిన ఏ ప్రభుత్వమైనా ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడానికి కృషి చేయడం చూస్తుంటాం. కానీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను తుంగలో తొక్కి.. ప్రజల జేబులు గుల్ల చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. వాల్మీకిపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. అధికారం చేపట్టిన ఆరు నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో రెండు సార్లు ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.15,485.36 కోట్లు కరెంటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నయవంచనతో మరోసారి ప్రజలను మోసం చేశారన్నారు. ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగాయని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తాము తప్పా ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచబోమని ఊక దంపుడు ఉపన్యాలు ఇచ్చిన టీడీపీ ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టి ప్రజలను మోసంచేయడంలో చంద్రబాబు మరోసారి బ్రాండ్ అంబాసిడర్‌గా నిరూపించుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో బాదుడే బాదుడన్న కూటమి నేతలు ఇప్పుడు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అన్ని రకాల నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగాయని, ఉచితమన్న ఇసుక ఎక్కడా లేక పోగా ఇసుక దందాలతో ప్రజలను దోచుకుంటూ అధికార పార్టీ నేతలు జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. బియ్యం, పప్పుదినుసులు, కాయకూరల రేట్లు.. ఆఖరికి తగ్గించి నాణ్యమైన మద్యమిస్తామన్న మద్యం రేట్లు కూడా విపరీతంగా పెంచేసి సామాన్యుల నడ్డివిరిచారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తాం

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ : పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తామని జవహర్ నవోదయ విద్యాలయ (1998–2005)వ బ్యాచ్ విద్యార్థులు అన్నారు. ఆదివారం చిత్తూరురోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అప్పట్లో పాఠశాలల్లో చదువుకున్న రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. తాము ఇంత ఉన్నత స్థాయికి చేర డానికి విద్యాలయమేనని చెప్పారు. విద్యాలయంలోని మల్టిపర్పస్‌హాలును పూర్వపు విద్యార్థుల సహాయంతో ఆధునీకరించారు. ఇరువైపులా శిలాతోరణాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అభివృద్ధికి ప్రతీకగా శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అర్ధసంవత్సర పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ రూ.2000, ద్వితీయ రూ.1000, తృతీయ రూ.500 చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. గురువులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేలాయుధన్, బెంగళూరు రూరల్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, రిటైర్డు ప్రిన్సిపాల్ కాశయ్య, లక్ష్మీనారాయణ, నవోదయ పూర్వ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

రెండు అనాథ శవాలకు దహన సంస్కరణ



అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ : మానవత్వం పరిమళించింది. నా అన్న వారు ఎవరూ లేకపోవడంతో మేమున్నామంటూ ముందుకు వచ్చి ఆదివారం రెండు అనాథ శవాలకు దహన సంస్కరణలు చేసి మానవత్వం చాటుకున్నారు హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు. మదనపల్లె బోధన ఆస్పత్రిలో ఇటీవల అనారోగ్యంతో నరసింహులు, సూర్యనారాయణలు మృతి చెందారు. వీరి కుటుంబీకులు ఎవరూ రాకపోవడంతో మార్చురీలో భద్రపరిచారు. విషయం తెలుసుకున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు టు టౌ పోలీసులను సంప్రదించారు. రెండు మృతదేహాలకు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబక్‌సిద్దిక్, సభ్యులు కిరణ్, ముఫీ, జైనుల్లా, గౌస్, అర్బాజ్, రఘు, సూరి పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి అవసరం



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ



తంబళ్లపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీటీసీ, కృషి సంస్థ సభ్యులు



ఎయిడ్స్ డే ఆకారంలో డిగ్రీ కళాశాల విద్యార్థినులు

పీలేరు : ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి అవసరమని స్థానిక ప్రభుత్వాస్పత్రి స్త్రీవైద్యనిపుణులు డాక్టర్ నాగవేణి అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డేని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ఆందోళన అవసరం లేదని, నిర్మూలనకు మెరుగైన అవగాహన పెంచుకోవాలని కోరారు. ముఖ్యంగా 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు వారు 60 శాతం వ్యాధి బారిన పడడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా రాదన్న అంశంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల ఎవరూ వివక్షత చూపరాదని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మునిరేఖ, సీహెచ్‌వో జయలక్ష్మి, హెచ్‌ఈ కొండయ్య, ఏపీవో జవహర్‌బాషా, పర్యవేక్షకులు శీను, చిన్నప్ప, స్వరూప, కోర్ సిబ్బంది రాజమ్మ, తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై నివారణపై అవగాహన ర్యాలీ

మదనపల్లె : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆదివారం ఆర్‌ఆర్‌ఎస్, ఐసీటీసీ, ఏఆర్‌టీ, జేసీ తదితరుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎయిడ్స్ బారిన పడ్డామనే అనుమానం ఉంటే తక్షణమే సమీపంలో ఏఆర్‌టీ కేంద్రాల వద్ద పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాజిటివ్ అని తేలితే మందులు తీసుకోవడం ద్వారా జీవితకాలాన్ని పెంచుకోవచ్చన్నారు. ఎయిడ్స్ నియంత్రణపై కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి రెడ్ రిబ్బన్ క్లబ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఏఆర్‌టీ కేంద్రాల పరిధిలోని ఐసీటీసీ కౌన్సిలర్లు, వైద్యులు ప్రతి శనివారం కుంగుబాటుకు గురైన బాధితులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం, జయకుమార్, పుల్లయ్య, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణకు కృషి చేయాలి

తంబళ్లపల్లె : హెచ్‌ఐవీ నివారణకు సమష్టిగా కృషి చేయాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి అన్నారు. ఆదివారం స్థానిక సీహెచ్‌సీలో ఐసీటీసీ, కృషి సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డుతో నినాదాలు చేశారు. ఈ ఏడాది హక్కుల మార్గాన్ని అనుసరించండి... నా ఆరోగ్యం నా హక్కు అనే నినాదం ఇచ్చినట్లు తెలిపారు. హెచ్‌ఐవీ రాకుండా మందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆస్పత్రిలో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రాంత్‌రెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్‌టి బాలాజీ, కృషి సంస్థ మేనేజర్ శ్రీనివాసులు, ఓఆర్‌డబ్ల్యులు సావిత్రి, రేఖ, ప్యారీ, నాగమణి, నరసింహులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

కలికిరి : కలికిరిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించి వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అంజలీదేవి మాట్లాడుతూ విద్యార్థినులు ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని, హెచ్‌ఐవీ రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. వ్యాధి వ్యాపించే కారణాలు, నివారణ పద్ధతులను వివరించారు. ఫేస్ పెయింటింగ్, రంగోలి, వ్యాసరచన, మైమ్ రీల్ వంటి పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

ఉత్తమ ఎన్‌సీసీ యూనిట్‌గా మిట్స్ కళాశాల

కురబలకోట : మదనపల్లె దగ్గరున్న అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు రాష్ట్రంలో ఉత్తమ ఎన్‌సీసీ యూనిట్‌గా (సీనియర్ డివిజన్/సీనియర్ వింగ్) గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం తెలిపారు. ఎనిమిదేళ్లగా ఎన్‌సీసీ కార్యకలాపాల ద్వారా క్రమశిక్షణ, దేశ భక్తి, నాయకత్వం, సహాజ సేవతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ చూపడం తదితర కార్యక్రమాలను పరిగణలోకి తీసుకుని ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్ కుమార్ గుర్తింపు షీల్డ్‌ను అందుకున్నట్లు తెలిపారు.